క్లుప్తంగా

నేడు మామిడి రైతులకు అవగాహన

ఐరాల: మండలంలోని మామిడి రైతులకు నాంపల్లె ఎస్పీ సావిత్రమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారిణి సాగరిక తెలిపారు. మామిడి తోటలో పూత, పిందె దశల్లో చేపటాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన శాఖ, వైఎస్సార్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మామిడి రైతులకు శిక్షణ ఇస్తారన్నారు. మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. రక్తహీనతకు గురికాకుండా గర్భిణులు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యం వస్తోందని వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. తుమ్మిందపాళ్యం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు చేశారు. ఇందులో 58 మంది రోగులు పాల్గొన్నారు. మంచానపడ్డ రోగులకు ఇంటివద్దే వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాధిక, రాజేశ్వరి, నందిని, నిరోషా తదితరులు పాల్గొన్నారు.


కాణిపాకంలో సినీ నిర్మాత సాయి కొర్రపాటి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం సినీ నిర్మాత సాయి కొర్రపాటి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వామి దర్శన ఏర్పాట్లు కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహితంగా తీర్చిదిద్దుతాం

కార్వేటినగరం: చిత్తూరు జిల్లాను సారా రహితంగా మార్చు తీసుకు రావడమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ పనిచేస్తోందని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో సారా అమ్మకాలు, తయారీలపై దాడులు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారి వివర్యాజీ గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ఎక్సైజ్ సిబ్బందికి అక్రమ వ్యాపారాల నివారణపై పలు సూచనలు, సలహాలను అందించారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ఈ ఊరికి నేనే లీడర్



ఒక్క పంచాయతీలోనే పదిమంది తామంటే తాము లీడర్లంటూ విసిగిస్తే...ఏం చేయాలి.. ఎంత మందికి సమాధానం చెప్పగలం. అధికారులంటే పది తలకాయలు ఉంటాయా?.. ఎంత మందికి సమాధానం చెప్పుకోవాలి? అని పల్లెలోని కొందరు అధికారులు, సిబ్బంది తీవ్ర మనస్తాపానికి లోనవుతున్నారు. వారు లోకల్ రాజకీయ ఒత్తిడిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. మండల అధికారులకు విషయం చెబితే.. ఆ తర్వాత ఏం జరుగుతుందో తెలియక తికమకపడిపోతున్నారు. ఒక వేళ మరో అడుగు ముందుకు వేసి కలెక్టర్ లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళితే రేపు స్థానికంగా పనిచేయగలమా? అనే ప్రశ్నలు వారిలో మెదలడంతో ఏం చేయాలో తెలియక తలలు వాల్చేస్తున్నారు. ఇంతకీ ఈ ఆధిపత్య పోరుకు దారెటో..

- పంచాయతీల్లో టీడీపీ ఆధిపత్యపోరు
- వ్యక్తిగత కక్షలు, రాజకీయాలకు ఆజ్యం
- అన్నింటా తలదూర్చుతున్న కొత్త ముఖాలు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న సీనియర్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలంలోని పంచాయతీల్లో టీడీపీ నేతల ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఎవరికి వారు తామే గొప్ప అంటూ స్వార్థ రాజకీయాలకు పదునుపెడుతున్నారు. ప్రధానంగా టీడీపీలోకి కొత్తగా చేరిన వ్యక్తుల పెత్తనం పెచ్చుమీరుతోంది. క్షేత్రస్థాయిలో తాము చెప్పిందే జరగాలంటూ కొత్త ముఖాలు పట్టుపడుతున్నాయి. అన్నీ తామై వ్యవహరిస్తూ.. అధికారులకు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది ఎవరు చెప్పినట్లు చేయాలో.. ఎవరికి పట్టం కట్టాలో తెలియక జుట్టు పీక్కుంటున్నారు. ఈ విషయం సీనియర్ల చెవిలోకి వెళ్లినా వారు ఏం చేయలేని పరిస్థితుల్లో మిన్నకుండిపోతున్నారు.

చిత్తూరు మండలంలో 17 పంచాయతీలు 120 గ్రామాలున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో ఒక్కో గ్రామానికి పదుల సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వీరిలో కొంత మంది నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయాలు, కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. గ్రామాల్లో తాము చెప్పిందే జరగాలని పట్టుపడుతున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు.. పది మందికిపైగా తామే లీడర్లంటూ అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ జాబితాలో మండలంలోని నాయకులు, అధికారులు 9 పంచాయతీలను లెక్కకట్టారు.

> • ఈ పంచాయతీకి నేనే లీడర్. అన్ని నేను సెప్పిందే సేయాలా. వాళ్లు.. ఈళ్లు అంటే ఒప్పుకోను. నాకు తెలియకుండా ఈ పంచాయతీలో ఏమైనా సేస్తే.. అంతే మళ్లీ.. బాగుండదు. ముందే సెబుతున్నా ఎవరి కాడైనా ఫోన్ సేయించాలా..చెప్పండి మేడం.. అంటూ ఓ టీడీపీ నాయకుడు పంచాయతీ స్థాయి అధికారిపై పెత్తనం.

> • మరో నాయకుడు.. ఏమన్నారంటే. ఈ పంచాయతీలో ఎలక్షన్ టైంలో బాగా కష్టపడి పని సేసింది నేనే. నా సేతిలో నుంచి లక్షలు ఖర్చు పెట్టేసి ఉండా. ఈ విషయం ఊళ్లో వాళ్లను అడిగితే సెబుతారు. ఇదంతా ఆ అన్న..ఈ అన్నకు కూడా తెలుసు. ఈ పంచాయతీలో ఏం జరగాలన్నా నాకు సెప్పి సేయండ. కుదరదంటే ఆఫీసు వదిలి వెళ్లిపొండ.

ఇలాగైతే ఎలా?

గ్రామస్థాయిలో జరిగే కార్యక్రమాలు, పనులు తమకు తెలిసే జరగాలని ఎవరికి వారు అధికారులు, సిబ్బందిని పీడిస్తున్నారు. వారు చెప్పినట్లు వినకపోతే.. బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాట వినని పక్షంలో వారి అనుచరులను రెచ్చగొట్టి అధికారులకు సమస్యలు సృష్టిస్తున్నారు. ఇలా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తూ.. వారి వశం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అప్పటికీ కాని పక్షంలో మండల నాయకులకు ఫోన్ చేసి ఆ అధికారి ఇలా.. ఈ అధికారి ఇలా అంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో మండల నాయకులు సైతం విసిగిపోతున్నారు. ఇటు వీరి స్వార్థ రాజకీయాలను భరించలేక..అటు నాయకులను, కార్యకర్తలను వదులుకోలేక మండల నేతలు కొన్ని పంచాయతీలకు దూరమవుతున్నారు. మినీ గోకులం పథకం, వర్కులు, సంఘమిత్ర, క్షేత్రసహాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు కొత్త ముఖాలకే కేటాయించడంతో పాత ముఖాలు కనుమరుగైపోతున్నాయి. రాజకీయ అనుభవం కలిగిన సీనియర్లు పంచాయతీల్లో జరిగే కక్ష, కుట్ర రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కొత్త ముఖాలు చేస్తున్న వ్యక్తిగత రాజకీయాల విషయంలో తల దాచుకుంటున్నారు. ఈ ప్రభావం అధికారులు, సిబ్బందిపై పడుతోంది. వ్యక్తిగత రాజకీయాలు సీనియర్ల చుట్టూ చక్రం తిప్పుతున్నాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు గత ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా వెళ్లారనే ముద్ర కూడా ఉంది. ఎక్కడ కానీ టీడీపీ శ్రేణులకు ఇబ్బంది కలిగించలేదని పేరుంది. దీంతో సీనియర్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సానుభూతి పరుల విషయంలో జోక్యం చేసుకోవడం లేదు. అయితే కొత్త ముఖాలు మాత్రం అధికారులతో పాటు సామాన్య ప్రజలను టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఆధిపత్య పోరుకు కట్టడి ఎలా?

పంచాయతీల్లో ఆధిపత్య పోరు పీకల్లోతుకు చేరింది. ఎవరికి వారు నేనే గొప్ప అంటూ అధికారుల గొంతు నొక్కుతున్నారు. ఇలాంటి తరుణంలో వారు దిక్కులు చూసుకుంటున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో కొంత మంది చేస్తున్న కక్ష రాజకీయాలను ఎప్పటికప్పుడు కొంత మంది సీనియర్ నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకెళుతున్నారు. కొన్ని పంచాయతీల్లో జరిగే కుట్ర రాజకీయాలు, అధికారులపై చేస్తున్న బెదింపుల విషయాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఓ మండల నాయకుడిపై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు టీడీపీలోని సీనియర్ వర్గాలు కోడై కూస్తోంది. ఆ నాయకుడి పదవిని తొలగించి బీసీ వర్గంలోని ఓ నాయకుడికి కట్టబెట్టే యోచనలో ఉన్నారని ఆ వర్గం బహిరంగంగా చెబుతోంది.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించి పౌష్టికమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి, ఫెమి–9 సంస్థ ప్రతినిధి అనంత్ మునిరాజ్ అన్నారు. చిత్తూరు నగరం ఎస్టేట్‌లోని సీడీపీఓ కార్యాలయంలో హెల్తీ పీరియడ్స్ అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పౌష్టిక ఆహారం శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తోందన్నారు. వైద్యులు చెప్పే సూచనలు పాటించి ఆరోగ్యకరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఓఎస్డీకి అదనంగా పాలనా బాధ్యతలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఏఎస్పీ (ఆపరేషన్స్)గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న రాజశేఖర్ రాజుకు కార్యాలయ పరిపాలన బాధ్యతలను సైతం అప్పగిస్తూ ఎస్పీ మణికంఠ ఆదేశాలు జారీ చేశారు. గురువారం అదనంగా ఏఎస్పీ పరిపాలన బాధ్యతలను రాజశేఖర్ రాజు స్వీకరించారు.

విద్యతో పాటు విలువలు ముఖ్యం


విద్యార్థులతో తులసీనాథం నాయుడు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చిన్నతనం నుంచే విద్యతో పాటు విలువలు ముఖ్యమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు అన్నారు. నగరంలోని జైహింద్, ఖాజీ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు నీతి పద్యాల పుస్తకాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలువలు లేని విద్య నిరుపయోగమని అన్నారు. నీతి కథలు, నీతి పద్యాలు బాల్యాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలోపు వందకు పైగా పద్యాలు నేర్చుకున్న పిల్లలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నీతిపద్యాల పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కల్పన, టీచర్లు ముక్తియార్, చంద్రశేఖర్, మహబుబ్‌భాషా, తనూజ, సరిత తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరం.. అల్లాడుతున్న జనం


డెంగీ జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు




ఇళ్లముందు నిల్వ ఉన్న మురుగు నీరు, మురుగు నీటికాల్వలో పేరుకున్న వ్యర్థాలు

- కడపగుంట దళితవాడలో విస్తరిస్తున్న డెంగీ జ్వరాలు
- వీధుల్లో పారుతున్న మురుగునీరు

గంగాధరనెల్లూరు: ప్రజల ప్రాణాలు గాల్లో కలసిపోకముందే అధికారులు స్పందించాలని కడపగుంట దళితవాడ ప్రజలు కోరుతున్నారు. మండలంలోని కడపగుంట దళితవాడలో పారిశుధ్యం లోపించింది. మురుగు నీటి కాలువలు వ్యర్థాలతో నిండి గ్రామం మురికి కూపంగా దర్శనమిస్తోంది. కనీసం బ్లీచింగ్ చల్లి పారిశుధ్యాన్ని మెరుగు పరచండని మొత్తుకుంటున్నా అధికారులు కనుచూపు మేరలో కనిపించక పోవడం విశేషం. దీంతో దోమలు వృద్ధి చెంది గ్రామంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. పదుల సంఖ్యలో జనం డెంగీ జ్వరాలతో మంచానపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు ఆస్పత్రిలో మగ్గుతున్నారు. దుర్గంధభరితంగా మారిన దళితవాడలో విధి లేక ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని, ప్రాణ నష్టం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎఫ్‌టీసీ జేమ్స్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. గురువారం పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాన్ని వారు సందర్శించి మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. అనంతరం తొట్టిలో ఉన్న ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన


మురుగునీటి గుంటను పరిశీలిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని పొన్నేడుపల్లెను జిల్లా మలేరియా అధికారులు గురువారం సందర్శించారు. పొన్నేడుపల్లెలో ఇంటింటికీ తిరిగి నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీరులో ఉన్న లార్వాలను నశింపచేశారు. మురుగునీటి కాలువలను పరిశీలించి శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, వైద్యాధికారి మోహన్‌వేలు, సూపర్‌వైజర్ నారాయణ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో జ్వరపీడితులను గుర్తించి రక్తన మూనాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, పైలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళల పెంపు తగదు


సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి

ఐరాల: పాఠశాలల పని వేళల పెంపు తగదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సమస్యలపై అధ్యయనం, సభ్యత్వ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అదనంగా సాయంత్రం 5 గంటల వరకు బడి వేళలు పొడిగించడం దారుణమన్నారు. ప్రధానంగా బాలికలు అభద్రతా భావానికి గురి అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న బడి వేళలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. అదే సమయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రన్, మండల ఎస్‌టీయూ నాయకులు యుగంధర్‌రెడ్డి, వినాయకరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన


పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో గురువారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా లైంగికంగా వేధించినట్లయితే వెంటనే ఇంటిలోని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. తమకు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన్న వయసులో చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల వయసు వచ్చేంత వరకు వివాహాలు చేయరాదన్నారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లయితే వెంటనే డయల్ 100కి కాల్ చేయాలన్నారు.

ఏకగ్రీవంగా పీఆర్‌టీయూ మండల కార్యవర్గం



బాలచంద్రారెడ్డి, నరసింహారెడ్డి

తవణంపల్లె: పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల ఎన్నికలకు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పీఆర్‌టీయూ అధ్యక్షులుగా ఎం.బాలచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షులుగా టి.బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.నరసింహారెడ్డి, సహాధ్యక్షులుగా టి.మునీశ్వర్, మండల ఉపాధ్యక్షులుగా భరత్‌కుమార్, కోశాధికారిగా బి.ఎం.రఘుపతిరెడ్డి, మండల అదనపు కార్యదర్శిగా డి.రాజేష్, మండల మహిళా అధ్యక్షురాలుగా కె.వి.శమంతకమణి, కార్యదర్శిగా రజని, సౌందర్య, కె.గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేష్‌బాబురెడ్డి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మాజీ మంత్రి రోజా

నగరి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా శ్రీశైలంలోని శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. గురువారం శ్రీశైలం వెళ్లిన ఆమె భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

హైవేలో నిర్లక్ష్యం






సూచిక బోర్డుకు అల్లుకు పోయిన తీగలు

బంగారుపాళెం: రహదారుల భద్రత, పరిశుభ్రతలో హైవే అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలివి. జాతీయ రహదారుల పక్కన ముళ్ల కంపలు ఏపుగా పెరిగిపోయి దారి కనపించకుండా తయారైంది. రహదారి పక్కన గ్రామాలకు వెళ్లే సూచిక బోర్డులకు తీగలు అల్లుకుపోయాయి. హైవే అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ టవర్లకు తీగలు అల్లుకుపోయాయి. మండలంలోని పాలమాకులపల్లె నుంచి శేషాపురం వరకు సరీ్వసురోడ్డు పక్కన కాలువ ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. హైవేపై ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైవే భద్రత, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.





మొగిలివెంకటగిరి విద్యుత్ టవర్‌ను చుట్టేసిన తీగలు, పాలమాకులపల్లె వద్ద రహదారిపైకి వచ్చిన ముళ్లపొదలు, నిరుపయోగంగా బస్‌షెల్టరు, శేషాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు